# ఎవరికోసం

రచన:
శ్రీమతి పతానేని శ్రీశైల భ్రమరాంబ

సీతకు నన్ను గురించి ఇల్లాంటి అవస్థ కల్గుతుందని ఏనాడూ ఊహించలేకపోయా. ఇప్పుడు ఆమెను చూస్తూంటే నాకు కళ్ళంట నీళ్ళు తిరుగుతున్నాయి. ఆమె ఆవిధంగా అధోగతికి రావడానికి నేనే కారకుణ్ణని నా అంతరాత్మ ఘోషిస్తోంది. చిన్నప్పటి నుంచీ నేనూ సీతా ఆడుకొని, పాడుకొని ఒకే యింట్లో ఆర్నెల్ల క్రితం వరకూ కల్సిమెల్సి వుండేవాళ్ళం. ఆమె అంటె నాకసలు కిట్టేదే కాదు. నన్ను అంటిపెట్టుకు ఆమె ఎంత దగ్గరగా వుండేదో; నేనంతగా కసిరికొట్టే వాడిని. అయినా ఓర్పుతో నా కోసం అహోరాత్రాదులు పాటు పడ్తూండేది. ప్రతి విషయంలోనూ మా అభిప్రాయాలు భేదంగానే వుండేవి. అందుచేతనే ఆమెను చూస్తూన్న కొద్దీ నాలో ద్వేషబీజం అంకురించి మహా వృక్షంగా పెకిగి ఆమెపై అసహ్యం ఏర్పడి పోయింది. సీత నల్లగా బొద్దుగా వుండడమే కాకుండా, చూపుల్లోగాని, మాటల్లో గాని ఆకర్షణ అందం కూడా వుండక పోవడంతో మరీ ఏవగించుకొంటూండే వాడిని. ఇంట్లో కూడా ప్రొద్దున్నే నిద్ర మంచంమీద నుంచి లేచేసరికి ఆమె ముఖం కన్పిస్తే ఛెళ్ళున చెంపమీద లెంపకాయ కొట్టి మరీ బయటికి వచ్చేవాడిని.

సీతకు చిన్నప్పుడే తండ్రి పోవడంచేత ఆమెనీ తల్లినీ కూడా తీసుకొని మా యింట్లోనే వుంచుకున్నాడు నాన్న. మా అమ్మ అనారోగ్యవంతురాలు కావడంచేత ఇంట్లో చాకిరీ అంతా చేస్తుందని అత్తయ్య వుండడానికి సమ్మతించిందే కాని ఆడబిడ్డమీద అసూయ లేక పోలేదు. నాన్నకి మాత్రం చెల్లెల్ని ఆవిడ కూతురు సీతని చూస్తూంటే తగని అభిమానం. ఆప్యాయత వుంది. ఒక్కర్తే చెల్లెలు కావడం చేత ఆవిడకి పాతికేళ్ళయినా రాకుండా వైధవ్యం కల్గడంతో, తండ్రిలేని లోటు కన్పించనీయకుండా ఎంతో ప్రేమగా నన్నూ సీతనీ సమంగా చూచేవాడు నాన్న. ఇంట్లో మగవానికి ఎంత ప్రేమవున్నా; ఆడవాళ్ళకుండే గృహాధికారం మాత్రం వుండదు కదా! అమ్మ ఆడబిడ్డనీ, ఆవిడ కూతుర్నీ పని మనిషికంటే హీనంగా చూచేది. ఏవగించుకొంటూండేది. అయినా ఏనాడూ నోరెత్తి ఆ తల్లీ కూతురు జవాబివ్వడం నేను వినలేదు. సీత అయిదో తరగతి ప్యాస్ కాగానే స్కూలుకి స్వస్తి చెప్పించి ఇంటి పనిలో ప్రవేశ పెట్టించారు. సీతకి చదువైనా చెప్పిస్తానని నాన్న ఇంట్లో కొంచెం హడావిడి చేసినా, అమ్మ మాత్రం ఆయన కోరిక కొనసాగనివ్వలేదు. 'ఓ అందమా; ఆకారమా; ధనమా; ఏమీ గతిలేని ఈ దరిపుగొట్టుకి ఇంక చదువు ఒక్కటే లోటొచ్చిందా?' అని అమ్మ ఈసడించి పారెయ్యడమే లేకుండా నాలో కూడా అదే భావాన్ని నాటింది. అమ్మ నన్ను చాటుమాటుగా కూర్చోబెట్టి అత్తయ్యతోనూ, సీతతోనూ మాట్లాడవద్దని, వాళ్ళని మనయింటి దాసీలుగా భావించాలని బోధిస్తూండేది-అత్తయ్య సీతకూడా నిన్నెప్పుడూ ఎంతో ప్రేమగా చూస్తూ ఆదరిస్తూంటే; ఎప్పుడైనా వాళ్ళతో కాస్త చనువుగా మాట్లాడ్డం అమ్మ కళ్ళ పడేసరికి నన్ను కఠినంగా దండిస్తూ, వాళ్ళతో మాట్లాడవద్దని హుకుం జారీ చేసేది.

సీత నాతో **మాట్లాడ**క పోయినా, నే నామెవైపు తలఎత్తి చూడక హోయినప్పటికీ నా పని విషయంలో మాత్రం ఏనాడూ అశ్రద్ధ వహించలేదు. నా అవసరాలను గుర్తించి ప్రొద్దుట టూత్ బ్రష్ మొదలు; రాత్రి నేను చదువుకోబోయే నవల కూడా రెడీగా అందుబాటులో పెడ్తూండేది; ఆమెను నే నెంత దూరంలో వుంచినా, నా మనస్సుకి ఏ క్షణంలో ఏది ఇష్టమో కూడా గుర్తించి ఆమె సిద్ధం చేస్తూంటే ఒక్కొక్కప్పుడు నాలో నాకే ఆశ్చర్యంగా వుండేది.

నేను ఇంటర్ లో చేరిన కొత్తలో ఓ రోజున ఇంటికి వచ్చేసరికి వీధులో కొందరు ముత్తయిదువులు నిల్చున్నారు. ఏమిటా విశేషం? అనుకొంటూ గుమ్మంలోకి వచ్చేసరికి మా లెక్చరర్ గారి తల్లి నావైపు తిరిగినవ్వుతూ 'నాయనా! రఘూ! అమ్మాయి అడ్డం తీర్చేసింది. ఇంక మాకు బూరె ముక్కలే తరవాయి. మేనత్తకూతురే కదా! అని గవ్ చిప్ గా ఆ మూడుముళ్ళూ వేస్తానంటే

మే మారుకొనేది లేదు సుమా!' అంటూ వేళాకోళం చేసారు.

'ఏమిటి?' అన్నట్లు అమ్మవైపు చూచా.

'సీత పెద్దమనిషైందిలే' అంది ముఖం ధుమధుమలాడిస్తూ.

'ఒక్క ఇంట్లో వున్న మేనత్త మేనమామ పిల్లలు. ఆ అడ్డు కాస్తా తీర్చేస్తే విటొచ్చి ఎటుపోయినా బాధుండదు, ఈ కాలపు వాళ్లని ఓ హద్దులో పెట్టడం కష్టం' అంది ఓ అనుభవనీయురాలైన పుణ్యాంగన.

అమ్మ ముఖం మాత్రం కందగడ్డలా వుంది,

'దాన్ని పెళ్ళాడ్డానికి ఎంత పాపం చేసుకుపుట్టాలో? ఆ దురదృష్టవంతు డెవడో సాపం' అనేశా చీదరించుకొంటూ. అక్కడి వారంతా చకితులై నా వైపు చూచారు. లోపల గుమ్మందగ్గర నిల్చున్న అత్తయ్య కళ్ళంట నిళ్ళు గిర్రున తిప్పుకొంటూ దొడ్లోకి వెళ్ళిపోయింది. ప్రక్క గదిలో నిల్చున్న నాన్నకూడా నామాట విని గుమ్మంలోకి వచ్చాడు. అందరూ నాకేసి చురచురా చూస్తూంటే వారి చూపులకి తట్టుకోలేక గబగబా నా గదిలోకి వెళ్ళిపోయా,

బి. ఎ లో చేరబోయే ముందు ఓరోజున అంతా కల్సి కూర్చున్నప్పుడు అమ్మ నా పెళ్ళి ప్రస్తాపన తెస్తూ ఓ ధనికుల అమ్మాయిని గురించి చెప్పింది. ఆ వెంటనే నాన్న నన్ను 'సీతను నువ్వు ఎందుచేత చేసుకోవు?' అని ఖచ్చితంగా అడిగాడు. నా తరఫున అమ్మ వకాల్తా నామా తీసుకు చెప్పడంతో, నా భారం కొంత తగ్గిపోవడమే కాకుండా ఇంక జన్మలో ఎన్నడూ నా ముందు కూడా సీతమాట ఎత్తకుండా చెప్పేసింది అమ్మ.

నేనింక సీతను పెళ్ళాడనని పూర్తిగా నిర్ధారణ అయిపోగానే అత్తయ్య క్రుంగిపోయింది. ఇంకొక్క క్షణమైనా మా యింట్లో వుండడానికి ఆవిడ మనస్సంగీకరించలేదు. సీత మాత్రం మా యిల్లు విడిచిపెట్టి రావడానికి సుతరామూ ఒప్పుకోక పోవడంతో విధిలేక ఉండి


మా హృదయపూర్వకమైన దీపావళి అభినందనలు !!

అత్యుత్తమమైన కేలండరులు

1961

* అందము, ఆకర్షణము గల సినిమా తారల టెక్ని కలర్ ఫోటో (coluor trans parency).
* హృదయాన్ని, కరిగించే, దేవుళ్ళ చిత్రములు, సహజ సౌందర్యమైన, ప్రకృతి దృశ్యములు విపరీతముగా దొరకును.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే.)

టెలిగ్రాం: 'కారనేషన్' (స్థాపితము 1936) ఫోన్: 54, 31, 27

—: వివరములకు :—

కొరనేషన్ లిథో వర్క్స్,

బి. బి. నెం: 2. శివకాశి. (S. 1)

పోయింది అత్తయ్య. సీతను నేను నిరాకరించినప్పటికీ అత్తయ్య నామీద చూపించే వాత్సల్యం, ఆమె కూతురి ప్రేమ చూస్తూంటే నాలో నేనే సిగ్గు పడ్తుండేవాడిని. అత్తయ్యకూడా రెండు మూడు సార్లు సీతను చేసుకోమనీ తన కూతురు సర్వ ఆశలు నామీదే పెట్టుకొందనీ, ప్రాధేయ పూర్వకంగా చెప్పి కళ్ళంట నీళ్ళు వలావలా కార్చింది.

అత్తయ్య కోరికపై సీతకి వరునికోసం అన్వేషణ సాగించారు. ఒక రోజున కొందరు పెళ్ళివారు సీతను చూచుకోడానికి వచ్చి'' ఏదో పిల్లలో అసలు లోపం ఉండబట్టే రఘు చేసుకోవడం మానేశాడు. మేన మామ కొడుకే పనికిరాని పిల్ల మాకుమాత్రం ఎందుకు?' అని చెప్పి తిరిగి వెళ్ళిపోయారు.

వాళ్లు వెళ్లి పోయాక అత్తయ్య ఒంటరిగా దొడ్లో కూర్చుని ఏడుస్తూంటే నా గుండెల్లో బాకులో పొడిచి నట్లు బాధపడ్డాను. అక్కడనుంచి సీత ఏంచేస్తుందో నని కిటికి సందుల్లోంచి చూచా. తలుపు లోపల గడియ వేసుకొని మంచంమీద పడి దుండెలు బ్రద్దలయ్యేలా ఏడుస్తోన్న సీతను చూచేసరికి కంపించి పోయా.

ఆ మర్నాడు ఒకసారి సీతతో మాట్లాడాలనుకొని ఆమె వున్న చోటికి వెళ్ళా - కాని తన ముఖం కూడా నాకు కన్పించడం ఇష్టంలేకనో; మరెందుకో కాని ఒక్క సారికూడా ఆమె నా కంటికి కన్పించలేదు. అకస్మాత్తుగా కన్పించినా తల నొంచుకు తప్పించుకునేదే కాని ముఖమెత్తి నావైపు చూడలేదు.

ఆ సంవత్సరంలో సీతకు ఆయిదారు సంబంధాలు తీసుకొచ్చాడు మా నాన్న. కానీ ఒక్కటీ స్థిరపడక పోవడంతో అత్తయ్య చాలా బెంగపడిపోయి, ఆ నిరాశతోనే నిద్రాహారాలు మాని దుఃఖిస్తూ చివరికి మంచం పట్టింది. చూస్తూండగానే ఆరు మాసాల్లో క్షీణించి పోయి ఓనాడు కన్ను మూసింది అత్తయ్య.

తల్లి పోయినా ఇంట్లో మేనమామ, భార్య, నేను అనాదరణ చేసి నా కిక్కురుమనకుండా సహిస్తూ మౌనంగా జీవియాత్ర సాగించేది సీత. ఆమెను చూస్తూంటే నాలో నాకు ఆశ్చర్యంగా ఉండేది. ఇంట్లో అమ్మ ఏయొక్క పనీ చెయ్యక్కర్లేకుండా యావత్తు గృహకృత్య భారాన్ని వహించేది. నా విషయంలో క్లాసుకు తీసుకువెళ్ళే బుక్సుతో సహా రెడీగా సద్ది ఉంచేది. ఆమె తీరిక సమయాల్లో వృధాగా కూర్చోకుండా మణుగులకొద్దీ వేస్టు పేపర్లు కొని అవి సంచులుగా తయారుచేసి కిరాణా కొట్లో అమ్మించేది. అడ్డాకులు తెప్పించి విస్తళ్ళు కుట్టి, కట్టలుగా కట్టి బజార్లో అమ్మించేది ఇంకా తిరికవుంటే చెత్త కాగితాలు నానబెట్టి రుబ్బి రకరకాలుగా అందమైన బుట్టలు తయారు చేసేది. ఎన్ని పనులు చేస్తున్నా ప్రతి రోజూ రెండు గంటల కాలం ఏదో సద్గ్రంధాన్ని చదువుతూ వుండేది. రాత్రి పదిగంటలు మొదలు తెల్లవారు ఝాము ఐదు గంటలవరకు మాత్రమే ఆమె మంచంమీద నిద్రించేంది. మిగతా కాలమంతా వంటయిల్లు, పూజగది తప్పించి మరెవరితో మాట్లాడికూడా ఎరుగదు. ఆమె మనస్సులోని మాటను తెలుసుకోడానికిగాని, వినడానికిగాని, మానవమాత్రులైవారికి అసాధ్యమని అందరికీ తెల్సు. ఒక్క మాటతో చెప్పాలంటే' సీత మానవాతీతురాలు' అనొచ్చు.

ఆ రోజు యం. ఎ. ఆఖరు పరీక్ష పేపరు వ్రాసి హుషారుగా యింటికొచ్చేసరికి, యింటినిండా పదిమంది మగవాళ్ళు, నలుగురు ఆడవాళ్ళు సావిట్లో ఆసీనులై వున్నారు, సీతకునచ్చిన పెళ్ళివారేమో అనుకొంటూ లోపలికొచ్చేసరికి, నా కోసమే వచ్చారని తెలియగానే ముచ్చెమటలూ పోశాయి. అర గంటలో వారికీ మాకూ వాదోపవాదాలు జరిగి అమ్మ అడిగిన ట్నం వారివ్వలేనడంతో గిర్రున తిరిగి వెళ్ళిపోయారు.

నాకు ఆరుమాసాల్లో ఎన్నో సంబంధాలు వచ్చి తిరిగి పోయాక అసలు కట్నం ఇవ్వననడంచేత సీతకూ, హెచ్చు కట్నం కావాలనడంచేత నాకూ ఒక్క సంబంధం కుదరలేదు. కాని ఒక్క నగ్నసత్యాన్ని మాత్రం తెల్సుకోగల్గా, ప్రతీ మానవులు ముఖ్యంగా చూచేది ధనం—విద్య, రూపం, యవ్వనం, గుణంకంటే కన్యాదాతలు ఇచ్చే కట్నమే ప్రధానంగా భావిస్తారని బాగా తెల్సుకొన్నా. కురూపి అయినా, అవలక్షణాల జ్యేష్ఠ అయినా, పరమమూర్ఖురాలైనా సరే; పదివేలు కట్నం వచ్చే సంబంధమే చేసుకోమని అమ్మ నిక్కచ్చిగా ఆజ్ఞాపించింది నన్ను. అమ్మ ఆజ్ఞ నెరవేర్చకపోతే నాకా

యింట్లో స్థానం సున్న-కోరిన కట్నం, లాంఛనాలు లభిస్తేనే అమ్మకి తృప్తి. ఇంక నా జీవితం, సంసారం ఎల్లా వున్నా ఆవిడకు సంబంధం లేదు. కట్నానికి అమ్ముడు పోయిన నన్ను భార్య బానిసగా చూచినా, భర్తగా గౌరవించినా, మా దాంపత్యంలో ప్రేమానురాగాలు వున్నా లేకపోయినా అది నా అదృష్టంమీద ఆధారపడవల్సిందేనని శాసించి చెప్పేసింది అమ్మ. ఇల్లా నిర్బంధించడం వివాహవిషయంలో అన్యాయమని నేను వాదించాను. 'కాతుకొద్దీ' గుజ్జం నడిపించే నీలోనేవుంటుంది. కాని భార్యలో ఏమీవుండదు. ఇంక అందచందాలు కూడా చూడబడే నీలోనే వుంటుందేకాని; అందం శాశ్వతమా?' అంది అమ్మ.

నాకు ఉద్యోగమైంది. జాయిన్ అవడానికి ఆ రోజే బయల్దేరి వెళ్లబోతున్నా. ఆ వార్త సీతతో స్వయంగా చెప్పాలని నాల్గురోజులనుంచీ విశ్వప్రయత్నం చేసినా ఆమె దగ్గర నిల్చునే అవకాశం నాకు లభించలేదు. నా భగీరథ ప్రయత్నం ఫలించకపోయినా వెళ్లేటైమ్ అయి బండి వీధులో నిల్చింది. గదిలో ఏదైనా మర్చిపోయానేమోనని చూసుకోడానికి ఇంట్లోంకి వచ్చేసరికి కిటికీ దగ్గర నిల్చున్న సీతను చూచి అల్లాగే నాపాదం నిలబడిపోయింది. సీత మాత్రం ఇదివరకులా పారిపోకుండా అల్లాగే నిల్చుండిపోయింది. 'సీతా! ఎవరికోసం? ... అల్లాచూస్తున్నావ్?... అని అప్రయత్నంగా ఆమె చేయ్యిపట్టుకొన్నా-

'ఒక్కసారిగా ఆమె తలపైకెత్తి నా కళ్ళల్లోకి సూటీగా చూచింది. ఆమె కళ్లల్లో ఇంత అందం, ఆకర్షణ, ఆ చూపుల్లో అంత ప్రభావం వుందని ఏనాడూ నాకు తెలీదు. అసలు ఆమె ముఖం నేను సరిగ్గా చూచి పంచవర్షాలు దాటింది. కొన్ని క్షణాలు అల్లాగే ఆమె కళ్లల్లోకి చూస్తూ నిల్చుండిపోయా-ఆమె గ్రుడ్లనిండా నీళ్లు తిరిగాయి. ఎక్కడ తన అశ్రువులు నా మీదరాల్తాయో అన్న భయమో; లేక మళ్లీ నేను ఏమైనా అంటావనే భీతోకాని తలవంచేసింది. ఆమె నోటితో ఏమీ విప్పి చెప్పకపోయినా 'ఎవరికోసం?' అని నేనడిగిన ప్రశ్నకు ఆమె కళ్లల్లోనుంచే నాకు జవాబు వచ్చేసింది. అయినా నా పౌరుషానికి లోపం రాకుండా 'నేను ఉద్యోగంలో చేరాక పెళ్లికూడా చేసుకొంటా. నువ్వింకా ఎవరికోసం ఇక్కడుంటావ్?' అని అడిగేశా.

నా మాటకి ఆమె మనస్సెంతగా క్షోభించిందో కాని 'నీకు నేనడ్డురాను. నన్ను మళ్లీ చూడలేవు' అనేసి అక్కడనుంచి వెళ్లిపోయింది సీత. ఆమె మాటలు నా గుండెల్లో గ్రుద్ది చెప్పినట్లుగా విన్పించాయి-అమ్మ లోపలికి రావడంతో నేను వీధులోకివెళ్లి బండెక్కానే కాని నా కళ్లముందు సీత ప్రత్యక్షంగా కన్పించి, ఆమె చూపులు నన్ను గాలం వేసి లాగేస్తూన్నట్టుగా అయింది. ప్రయాణం ముందుకు సాగుతున్నా మనస్సు మాత్రం యమపాశం వేసి సత్యవంతుని ప్రాణాలు లాక్కుపోతూన్నట్లు సీత వైపుకే పోతోంది.

ఉద్యోగంలో స్థిరపడి జీవితంలో నూతనాధ్యాయం ప్రారంభమైంది. ప్రతిచిన్న పనిలోనూ సీత గుర్తొచ్చి ఎంతో వెల్తిగా కన్పించేది. ముఖాముఖీని నాతో మాట్లాడకపోయినా, నామనస్సుని గుర్తించి నన్ను నడిపించే సీత లేకపోతే; నేను ఎప్పుడు ఏ బట్టలు కట్టుకోవాలో కూడా తెల్సుకోలేని వాడినయ్యాననుకోగానే నాలోని దుర్బలతనం, సీతవల్ల నాకెంతగుప్త ఉపకారం జరుగుతోందో సంపూర్ణంగా గుర్తించుకొన్నా. తీరిగ్గా వున్న ప్రతీక్షణం అప్రయత్నంగానే ఆమెను తల్చుకొంటూ ఆరు మాసాలు గడిపాను.

ఓ రోజు నాన్నగారి దగ్గరనుంచి జాబు వచ్చింది. అందులో నాకో పెండ్లి సంబంధాన్ని గురించి వ్రాస్తూ, ఆ అమ్మాయిని చూచుకోడానికి రమ్మని వ్రాసి; చిట్టచివరమాత్రం 'సీత ఆరోగ్యం చాలా ప్రమాదస్థితిలో వుంది' అని వ్రాసేడు. అది చదువుకోగానే సీతను చూడాలని మనస్సు తహతహలాడింది. వెంటనే ప్రయాణమయ్యా.

ఇంటికి వచ్చి మంచంమీదవున్నా సీతను చూసేసరికి భోరున ఏడుపొచ్చింది. గతాన్ని తల్చుకొంటూ అల్లాగే చూస్తూ నిల్చుండిపోయా-నన్ను చూచి అమ్మ 'రఘు! ఇంక సీతకి క్షణాలు ప్రొద్దుట ఒక్కసారి కళ్లు విప్పి చూచి 'బావా!' అని అడిగింది. మళ్లామరి మాట్లాడలేదు' అంది,

ఒక్కసారిగా అమ్మ ఆమాట అనేసరికి నా గుండె పగిలిపోయేటంత దుఃఖం పొంగి పొర్లివచ్చింది. ఆమెకు వైద్యం చేయించరనే సంగతి నాకు ముందే తెల్సు-ఈ మాత్రం మాట మా అమ్మ నోటంట వచ్చిందంటే అంతకు వెయ్యింతలైనా సీత నాకోసం బాధపడివుంటే కాని అమ్మ బైటికి అనేటంత వాత్సల్యం, సానుభూతి ఈ సీతమీద లేదని నాకూ తెల్సు. ఒక్కసారిగా వెళ్లి సీత ప్రక్కని కూర్చున్నా—'బావా!' అని కలవరిస్తోంది.

వెంటనే హాస్పటల్‌కి ఫోనుచేసి అంబులెన్సుకారును పిలిపించి సీతను అందులో ఎక్కించాను. 'ఎందుకురా? దానికోసం అంబులెన్సు కారును తెప్పించడం?' అంది అమ్మ.

ఇంక ఎవరితోనూ నోరెత్తి జవాబైనా చెప్పకుండా ఆ అసిపంజరాన్ని అందులో ఎక్కించుకు ఆస్పత్రికి వెళ్లా. కాని రోగం శ్రుతిమించిపోయిందని, బ్రతకడం దుర్లభమని డాక్టర్లు చెప్తూ సీతను ఆస్పత్రిలో చేర్చుకోమని నిరాకరించారు. ఎంత సొమ్ము ఖర్చయినా ప్రాణమున్నంతవరకూ కాయశక్తులా ప్రయత్నించి వైద్యం చెయ్యమని ప్రాధేయపడ్డంతో అతికష్టంమీద సర్జను నాకు మిత్రుడు కావడంచేత అంగీకరించారు. స్పెషల్ వార్డులో వుంచి రాత్రిబగళ్లు ఆమె సేవకుడనయ్యాను. పదిరోజులయ్యేసరికి సీతకు రోగం తగ్గుముఖం పట్టింది. ఓరోజున పళ్లరసం త్రాగిస్తూంటే నా ముఖంలోకి తేరిపారిచూచి ఇంక త్రాగలేకపోయింది సీత.

'త్రాగు సీతా! నీలాంటి దేవతని ఇవ్వాళ్లూగుర్తించుకోలేకపోయా' అన్నా.

'నేను ఎవరికోసం బ్రతకాలి?' ఎంతో నీరసంగా అంది.

'నాకోసం! నన్ను మన్నించు సీత! నిన్ను తప్ప నే నెవ్వరినీ పెళ్లాడను.' అని అంటూండగానే ఆమె నా ఒళ్లో జరిగిపోయింది.

నెల రోజులయ్యేసరికి ఆనందవల్ల మనస్సుకి, ఔషధాలవల్ల శరీరానికి పూర్తి ఆరోగ్యం కల్గింది. ఇంటికి తీసుకువెడ్తే ఆమెకు స్వయంగా సేవచేసే భాగ్యం నాకు లభించదని నా ఊరుతీసుకువెళ్లిపోయా-అమ్మతో వాదించి గెలిచేందుకు అశక్తుణ్ణి కాబట్టి మూడు నెలలుపోయాక రిజిష్టర్ మ్యారేజి చేసుకు సీతా నేనూ దంపతులమైనట్లుగా మా ఫోటోలు న్యూస్ పేపర్లో వేయించి మా అమ్మకి పరోక్షంలో పంపించాను-

రఘు సీత చిన్ననాడే నిర్ణయింపబడిన దంపతులు కావడంచేత లోకంఆశ్చర్యపడకపోయినా; తల్లిమాత్రం తెరచిన నోరు తెరిచినట్లేవుంచి నేలకి ఒరిగిపోయింది.

TRADE MARK

SARASWATHI HANDLOOM TEXTILES

Regd No: 84959

మధురైలో ఉత్పత్తి అయ్యే స్పెషల్ రకముల చేనేత బట్టలులో, శ్రేష్ఠమైనదిగా పేరొందినదీ, ఎక్కువగా తయారయ్యేదీ, విపరీతముగా అమ్మకమయ్యేది మా —

'సరస్వతి'

చేనేతబట్టలే!!

మరియు 2/64, 2/42, డైమన్ గుడ్డలూ, 2/42 డైమన్ ధోవతులూ, విపరీతముగా తయారిస్తున్నాము. ఒకతూరి ఉపయోగించి చూచినవారు మరీ మరీ వీటినే కొనుచున్నారు.

— తయారించువారు: —

సరస్వతీ హేండ్‌లూమ్ టెక్స్‌టైల్స్

నెం. 14 పాలం స్టేషన్ రోడ్

సెల్లూర్ : : మధురై-2.